# శ్రీ వేణుగోపాల స్వామి ఓరియంటల్ ఉన్నత పాఠశాల చేకూరపాడు వజ్రోత్సవ సందర్భంగా

ముందుగా నాకు చదువు నేర్పించిన గురువులందరికీ పాదాభివందనాలు.

నేను రాయపూడి పద్మావతి, 1982 batch 10th Class, ప్రభుత్వ ఉపాధ్యాయనిగా పని చేస్తున్నాను. నేను చదివిన పాఠశాలలోని చిన్ననాటి జ్ఞాపకాలను మీ అందరితో పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది.

నేను 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదివిన ప్రాథమిక పాఠశాల ఊరిలో గల మంచినీళ్ళ బావి దగ్గర ఉన్న ఒక పెంకుటింట్లో నిర్వహణ జరిగేది. నేను 1వ తరగతి చదివేటప్పుడు శ్రీమతి సరస్వతి మేడం గారు, 2వ తరగతికి ఇనమనమెళ్ళూరు నుండి ఒక మాస్టారు వచ్చేవారు, వారు పంచకట్టులో చక్కగా ఉండేవారు. వారు వచ్చేటప్పుడు నేరేడు పండ్లు, జామ పండ్లు తెచ్చి పిల్లలందరికీ పంచేవారు. 3వ తరగతికి శ్రీ కోమటి పంతులుగారు, 4వ తరగతికి శ్రీ నాగా చారి మాస్టారు, ప్రధానోపాధ్యాయులుగా శ్రీ ఆళ్ల వెంకటసుబ్బయ్య గారు ఉండేవారు . వీరందరూ నాకు అక్షరాలు నేర్పించి, ఓనమాలు దిద్దించి నా ఈ ఉన్నత స్థితికి కారకులైన వీరందరినీ ఒక్కసారి గుర్తు చేసుకోకుండా ఉండలేకపోయాను. నేను 5వ తరగతికి వచ్చేటప్పటికి ప్రధాన ఉపాధ్యాయులుగా శ్రీ వేమూరి వెంకటేశ్వరరావు గారు ఛార్జ్ తీసుకున్నారు. ఆయన మా క్లాస్మేట్ కుసుమకుమారికి నాన్నగారు. వారు నేర్పించిన వర్ణమాల గుణింతాలు, పద్యాలు, అంకెలు, ఎక్కాలు, చతుర్విధ ప్రక్రియలు ఇవన్నీ ప్రాథమిక పాఠశాలలో వారి దగ్గర నేర్చుకునే పై తరగతులకు, వెళ్ళగలం, చదవగలం. అందుకే మనకు గట్టి పునాది వేసిన గురువులందరికీ నా నమ: సుమాంజలి.

6వ తరగతి నుండి 10వ తరగతి వరకు మన ఊరి పాఠశాలలో చదువుట ఒక మారుమూల పల్లెలో ఉన్నత స్థాయి పాఠశాల ఉండటం మన అదృష్టంగా భావించాలి. 1962 నుండి ఎంతో మంది విద్యను అభ్యసించి ఉన్నత

స్థాయికి ఎదగడానికి పాఠశాల స్థాపనకు కృషిచేసి ఊరిలో వారికే కాక చుట్టు ప్రక్కల గ్రామాల విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తెచ్చిన గ్రామ పెద్దలకు మనం రుణపడి ఉంటాం అనుకుంటున్నాను. వారందరికీ పేరుపేరునా నా ధన్యవాదములు తెలియజేసుకుంటున్నాను.

మన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీయుత గౌరవనీయులైన శ్రీ తన్నీరు గురవయ్య మాస్టారు గారు క్రమశిక్షణకు మారుపేరుగా విద్యార్థులందరి పట్ల ప్రేమాభిమానాలతో ఉండేవారు. 6వ తరగతిలో శ్రీవెల్ది వెంకటేశ్వరరావు మాస్టర్ గారు, శ్రీ నరసింహారావు మాస్టర్ గారు, హిందీ మాస్టారు గారు చక్కని విద్యా బోధన చేసేవారు.

శ్రీమతి సూర్యకుమారి మేడంగారు మాకు ఇంగ్లీష్, N.S., పాఠాలు బోధించేవారు. మేడంగారు బోర్డుపై వ్రాసి చెప్పే గ్రామర్ ఇప్పటికీ నా కళ్ళ ముందు కనబడుతూ ఉంటుంది. చక్కగా అందరికీ అర్థమయ్యే రీతిలో బోధించేవారు. మేడం గారు తోట పని, పాఠశాల వార్షికోత్సవమునకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపాధ్యాయులు అందరూ కలిసి శకుంతలం నాటకం, పిట్టలదొర, అత్తలేని కోడలు ఉత్తమురాలు, పాటలకు డాన్స్ నేర్పించి ప్రదర్శింప చేయడం గుర్తుంది.

మన సంస్కృత పండితులు శ్రీ శ్రీనివాస్ పిళ్ళై గారు చక్కగా శ్లోకాలు నేర్పించేవారు. క్లాసులో ఎవరైనా శ్లోకాలు నేర్చుకోకపోతే వారికి ఇంత పీడ (పేడ) తెచ్చి పెట్టాలి అని ముద్దుగా అనేవారు. ఇంకా శ్రీ సూరం సుధాకర్ మాస్టారు చాలా తక్కువ మాట్లాడేవారు. సంస్కృత భాషను చక్కగా నేర్పించేవారు. అలాగే సంస్కృతంలో ప్రవేశిక, ప్రధమ, ద్వితీయ పరీక్షలు కూడా రాయించేవారు. అందరూ బాగా చదువుకోవాలని ఆకాంక్షతో ఉండేవారు. మా తరగతిలో విద్యార్థులకు "నేత్రావధానం" నేర్పించి పాఠశాలలో ప్రదర్శింప చేసేవారు. ఇంకా మాథ్స్ మాస్టారు శ్రీరామారావు గారు, శ్రీ పి సుబ్బారావు మాస్టారు, తెలుగు పండితులు శ్రీ సారంగపాణి గారు ఆయన చెప్పిన భాషాంశాలు, చందస్సు ఇప్పటికీ మర్చిపోలేదు. ఇంకా మన పాఠశాల PET మాస్టారు శ్రీ ముప్పరాజు సుబ్బారావు గారు మా చేత ఆటలు ఆడించేవారు, ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవారు.

ఇంకా బోధనేతర సిబ్బంది శ్రీ శేషయ్య గారు, శ్రీ వెంకయ్య గారు , స్వీపర్ చందా ఇప్పుడు ఉన్న కరీముల్లా గారి నాన్నగారు మంచినీరు తేవడానికి, బెల్ కొట్టడానికి ఉండేవారు మేము చదివేటప్పుడు. మన పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. వారి దగ్గర కుట్లు , అల్లికలు కూడా నేర్చుకోవడం జరిగింది.

మా తరగతిలో ప్రతి ఒక్కరూ నాకు చాలా బాగా గుర్తు. One Year back, నా క్లాస్మేట్ వడ్డేళ్ళ పద్మను అడిగాను నేను మన క్లాస్ వాళ్ళం అందరిమి ఒకసారి కలుద్దాం అని అనుకున్నాం అది అంత తేలికగా సాధ్యం అయ్యే పని కాదనుకున్నాం. కానీ దాన్ని సుసాధ్యం చేసి మన పాఠశాల వజ్రోత్సవ వేడుకలను ఘనంగా జరపబోతున్న వారందరికీ నా ధన్యవాదములు.

చివరిగా, మన గురువులు అందరూ నేర్పించిన విద్యతో, నా కృషి పట్టుదలతో నేను ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పదిమందికి అక్షరాలు నేర్పించగలుగుతున్నాను. ఈ అవకాశమును నాకు ఇచ్చిన వారందరికీ, నాకు చదువు నేర్పిన గురువులకు పాద నమస్కారములతో ధన్యవాదములు.

గురు బ్రహ్మ గురువిష్ణు
గురుదేవో మహేశ్వరః
గురు సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః

మనిషి పుట్టినప్పటినుంచి మరణించేదాకా ప్రతి అడుగులోను, ప్రతిక్షణం లోను మనం ఏదో కొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాం. మనం నేర్చుకునే ప్రతి అంశం వెనుక గుప్తంగా ఒక గురువు దాక్కునే ఉంటాడు. కానీ ఆ గురువుని మనందరం ప్రత్యక్షంగా చూడగలిగేది తరగతి గదిలో విద్యనభ్యసించినప్పుడే. ప్రతి విద్యార్థి గురువును దైవంగా భావిస్తూ తన భవిష్యత్తుకు ఆయన అనుభవాన్ని వారధిగా చేసుకుని ముందుకు సాగుతారు. జీవితంలో వారికి కేటాయించినంత సమయాన్ని గురువు వద్ద

గడుపుతారు.      అలా మన జీవితాలకు ఓ రూపం కల్పించి,   తీర్చిదిద్దిన గురువులనే ప్రత్యక్ష దైవాలుగా భావించి, మనమంతా ప్రేమతో పూజించి, స్మరించుకుందాం, సన్మానించుకుందాం.

ఇట్లు,
రాయపూడి పద్మావతి,
1982 batch 10th Class,
చేకూరపాడు.